అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
మంగళవారం 14 ఫిబ్రవరి 2023

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని శిక్షించాలి

నవతెలంగాణ-దహెగాం

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఆయా సంఘాల నేతలు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి దళిత, బహుజనల మనోభావాలు కించపరిచే విధంగా మాట్లాడిన హమార ప్రసాద్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా దళిత సంఘాల నాయకులు రాజయ్య, మల్లేష్, రాజారాం, ప్రేమ్‌సాగర్, ప్రశాంత్, దేవాజి, గౌతమ్, మహేందర్, అంకులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-చింతలమానపల్లి



నిరుపేదలకు అందాల్సిన రేషన్ బియ్యం అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. మండలంలోని కర్జెల్లి గ్రామంలో టాస్క్ ఫోర్స్ అధికారులకు అందిన పక్కా సమాచారం మేరకు జూన్గారి శ్రీనివాస్ ఇంట్లో నిల్వ ఉంచిన ఏడు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు టాస్క్ ఫోర్స్ సీఐ సుధాకర్ తెలిపారు. ఈ టాస్కులో టాస్క్ ఫోర్స్ సీఐ సుధాకర్, ఎస్ఐ సందీప్ కుమార్ పాల్గొన్నారు.

అరణ్యంలో 'ప్రకృతి' వనం..!

- అనేక గ్రామాల్లో అడవికి ఆనుకొని కంచెలు
- కొన్ని మొక్కలు నాటి..బోర్డులు పెట్టేసిన వైనం
- ప్రకృతి వనాల పేరిట రూ.కోట్లు దుర్వినియోగం
- క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడైన డొల్లతనం

అడవి అంటేనే..పచ్చని చెట్లు, ప్రకృతి రమణీయంగా కనిపిస్తుంటుంది. అలాంటి చోట్ల కొత్తగా కృత్రిమ వనాలు ఏర్పాటుచేయడం అవసరం లేదు. కానీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మాత్రం అరణ్యంలోనే ప్రకృతి వనాలు ఏర్పాటుచేసి నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘించారు. అనేక చోట్ల అడవులకు ఆనుకొని కంచెలు వేసి ప్రకృతి వనం పేరిట బోర్డులు పెట్టేశారు. వీటితో పాటు మరికొన్ని గ్రామాల్లో ఊరికి బహుదూరంలో కొన్ని మొక్కలు నాటి ఇదే ప్రకృతి వనం అని పేరు పెట్టేశారు. ఈ వనాలతో స్థానిక ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోవడంతో పాటు కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనం దుర్వినియోగమైందనే విమర్శలున్నాయి. చాలా చోట్ల ఏర్పాటుచేసిన వాటిలోనూ సరైన సంరక్షణ లేక ప్రకృతి వనాలు కళావిహీనంగా కనిపిస్తున్నాయి. జిల్లాలో అనేక చోట్ల ఇలాంటి పరిస్థితి ఉన్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడైంది.



నేరడిగొండ మండలం రోడ్ సావర్‌గాం గ్రామ సమీపంలో ఏర్పాటుచేసిన పల్లె ప్రకృతి వనం ఇది. అప్పటికే ఇక్కడ దట్టమైన అడవి ఉండగా దాని కింది భాగంలో పల్లె ప్రకృతి వనం అని బోర్డు పెట్టి..చుట్టూ కంచె నిర్మించి కొన్ని మొక్కలు నాటి వదిలేశారు. అడవికి ఆనుకొని ఏర్పాటుచేసిన ఈ ప్రకృతి వనంతో స్థానిక ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేకుండా మారింది.



నేరడిగొండ మండలం నాగమల్యాల్ గ్రామానికి సమీపంలో ఏర్పాటుచేసిన పల్లె ప్రకృతి వనం ఇది. ఇక్కడ కూడా అడవికి అత్యంత సమీపంలో ఏర్పాటుచేసి కంచె వేసి ప్రకృతి వనం బోర్డు పెట్టేశారు. అప్పటికే అక్కడ అడవి ఉండటంతో సహజంగానే ఆహ్లాదం ఉంటుంది. ఇక్కడే ప్రకృతి వనం ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేకుండా మారింది. ఇలాంటి పరిస్థితి జిల్లాలోని అనేక గ్రామాల్లో ఉంది.

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పట్టణంలో పార్కులు ఉన్నట్లు పల్లెల్లో కూడా ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేందుకు ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటుచేసింది. ఎకరం స్థలంలో రూ.7.40లక్షలు..ఇంతకంటే తక్కువగా ఉంటే రూ.4లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఉపాధిహామీ నిధులను కేటాయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనం ఏర్పాటుచేయాలని స్పష్టం చేశారు. కానీ చాలా గ్రామాల్లో ఊరికి దగ్గరగా ప్రభుత్వ స్థలాలు లభించకపోవడంతో చాలా దూరంగా కొద్దిపాటి స్థలం ఉన్న చోట్ల ఏర్పాటుచేశారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో అటవీ ప్రాంతం అధికంగా ఉండటం.. దాదాపు మెజార్టీ గ్రామాలు అడవికి దగ్గరగానే ఉండటంతో పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు కలిసివచ్చింది. వీటిని ఎక్కువగా స్థానిక ప్రజాప్రతినిధులే పనులు చేపట్టారు. స్థలాభావం సమస్యలతో పాటు అప్పటికే అక్కడ అడవి ఉండటంతో పచ్చదనం దానికదే పెరుగుతుందని భావించిన గుత్తేదారులు అరణ్యాలకు ఆనుకొని ఏర్పాటుచేశారు. అప్పటికే అక్కడ అవసరమైన పచ్చదనం ఉండటం.. మళ్లీ పార్కుల పేరిట అక్కడే బోర్డులు పెట్టడంతో అవి ఎలాంటి ప్రయోజనం లేకుండా మారింది.

● ప్రజాధనం దుర్వినియోగం..?

ఉమ్మడి జిల్లాల్లో ఏర్పాటుచేసిన పల్లె ప్రకృతి వనాల ద్వారా ఎలాంటి ప్రయోజనం లేకుండా మారింది. ఆదిలాబాద్ జిల్లాలో 468 గ్రామ పంచాయతీలు, కుమురంభీం జిల్లాలో 335, నిర్మల్ జిల్లాలో 396, మంచిర్యాల జిల్లాలో 310 పంచాయతీలు ఉన్నాయి. ప్రస్తుతం అన్ని పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటుచేశారు. స్థానిక ప్రజలకు ఆహ్లాదం కలిగించేందుకు ఉపయోగపడాల్సిన ఈ వనాలు వారికి దూరంగా ఉండటంతో ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదు. వీటి ఏర్పాటు కోసం వెచ్చించిన రూ.కోట్లాది నిధులు దుర్వినియోగం అయినట్టు విమర్శలు న్నాయి. ముఖ్యంగా చాలా చోట్ల అడవులు, చెరువుల్లో ఏర్పాటుచేసినా అధికారులు వాటికి బిల్లులు చెల్లించినట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో ఎలాంటి పరిశీలన చేయకుండానే రాజకీయ నాయకుల ఒత్తిడితో బిల్లుల చెల్లింపులు జరిగినట్లు తెలుస్తోంది. ఈ వనాలు నిబంధనల మేరకు లేనప్పటికీ అధికారులు కూడా ఎలాంటి పరిశీలన చేపట్టలేదు. క్షేత్రస్థాయిలో చూడకుండానే బిల్లులు చెల్లించినట్లు తెలుస్తోంది. ఈ విషయమై డీఆర్‌డీఓ కిషన్‌ను సంప్రదించగా.. చాలా చోట్ల సరైన చోటనే పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటుచేశారని తెలిపారు. అడవిలో ఉన్న విషయాన్ని తెలుసుకుంటామని వివరించారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ముట్టడి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గత ఏడు రోజులుగా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపిన కార్మికులు మున్సిపల్ కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం పికెటింగ్ నిర్వహించారు. తమకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించాల్సి ఉందని, ఈఎస్ఐ, పీఎఫ్ సైతం జమ చేయడం లేదని కార్మికులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ బకాయి పడ్డ వేతనాలు వెంటనే చెల్లించాలని, కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ లేకపోవడంతో ఈఎస్ఐ ఆస్పత్రికి వెళ్తే కనీసం మందులు కూడా ఇవ్వడంలేదని అన్నారు. నాలుగు నెలలుగా వేతనాలు లేకపోవడంతో పిల్లల ఫీజులు కట్టుకోలేక పోతున్నారని అన్నారు. కార్మికులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్, చైర్మెన్ వచ్చి స్పందించే వరకు ఆందోళన విరమించమని కూర్చున్నారు. దీంతో కమిషన్ అంజయ్య, చైర్మెన్ సద్దాం హుస్సేన్‌లు వచ్చి కార్మికులతో చర్చలు జరిపారు. ముందుగా రెండు నెలల వేతనాలు నెలల వేతనాన్ని చెల్లిస్తామని చెప్పగా కార్మికులు నిరాకరించారు. కార్మికులు ఎంతకీ వినకపోవడంతో మూడు నెలల వేతనంతో పాటూ ఈఎస్ఐ చెల్లించేందుకు అంగీకరించారు. త్వరలోనే పీఎఫ్ డబ్బులు చెల్లిస్తామని హామీ ఇచ్చి మూడు నెలల వేతనాన్ని, ఈఎస్ఐ డబ్బులను కార్మికుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు సంజీవ్, శంకర్, మల్లేష్, శంకరమ్మ పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ నెల 16న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ అన్నారు. ఆశ వర్కర్లతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని అన్నారు. అర్హత కలిగిన ఆశ వర్కర్లకు రెండో ఏఎన్ఎంలుగా ప్రమోషన్ ఇవ్వాలని అన్నారు. అదనపు పనికి అదనపు వేతనాలు ఇవ్వాలని కోరారు. కంటి వెలుగు, లెప్రసీ సర్వేలకు అదనపు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టి చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ఆశ వర్కర్లంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు స్వరూప, ఆశ వర్కర్స్ స్వప్న, అమరవాణి, నిర్మల, లలిత, నవీన, అరుణ లావణ్య పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు చూడాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వస్తు కొనుగోలులో నాణ్యత ప్రమాణాలు, ఐఎస్ఐ మార్క్ కలిగిన వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాజేశం అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో కేంద్ర ప్రభుత్వ పౌరసరఫరాలు, వినియోగదారుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ప్రమాణాల సంస్థ (ఐఎస్ఐ)పై జిల్లా అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వర్, శిక్షకులు రాకేష్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులు గృహ ఉపకరణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతర వస్తువులు కొనుగోలు చేసే సమయంలో నాణ్యత ప్రమాణాలతో పాటు ఐఎస్ఐ మార్క్‌ను తప్పనిసరిగా పరిశీలించాలని, ఆ దిశగా అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పరిశ్రమలు, లేబరేటరీలు ఇతర ఉత్పత్తులపై జాతీయ ప్రమాణాల సంస్థ అనుమతులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలు వేరువేరుగా ఉంటాయని తెలిపారు. బంగారం, వెండి వస్తువులపై ఐఎస్ఐ మార్క్ తప్పనిసరిగా చూడాలని అన్నారు. కల్తీ ఉన్నట్లయితే వినియోగదారుల ఫోరం ద్వారా నష్టపరిహారం పొందవచ్చని తెలిపారు. వస్తువుల కొనుగోలు సమయంలో నాణ్యత పరీక్షించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం అందించే సేవలు కూడా వినియోగం పరిధిలో ఉన్నందున అధికారులు, ఉద్యోగులు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని తెలిపారు. తయారీదారులు, వినియోగదారుల మధ్య నమ్మకం ఉండాలని, వస్తువుల తయారీలో నాణ్యత పాటించాలని తెలిపారు. జాతీయ ప్రమాణాల సంస్థ అనుమతి జారీ చేసిన వస్తువులను మాత్రమే కొనుగోలు చేసే విధంగా ప్రజలలో అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుండి వచ్చిన శిక్షకులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా అధికారులకు వివిధ అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వేలాల జాతర ఏర్పాట్లు పరిశీలన

నవతెలంగాణ-జైపూర్

వేలాల జాతరకు వచ్చే భక్తుల కనీస సౌకర్యాలు కల్పించాలని, భక్తుల రద్దీకి సరిపడ ఏర్పాట్లు చేయాలని అందుకు సంబంధించిన ఏర్పాట్లను మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్ రావు, తహసీల్దార్ మోహన్ రెడ్డి, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎస్సై రామకృష్ణ సోమవారం పరిశీలించారు. గట్టు మల్లన్న వెలిసిన పర్వత ప్రాంతంతో పాటు వేలాల శివారులో భక్తుల విడిదికి గల వసతులను పరిశీలించారు. అదేవిధంగా గోదావరి నది పుష్కర ఘాట్ ఏరియాను పరిశీలించిన అధికారులు ప్రమాదాలకు తావివ్వకుండా గోదావరి తీరంలో ముందస్తు జాగ్రత్తలు తదితర విషయాలపై స్థానిక సర్పంచ్ ప్యాగ శ్యామల లక్ష్మన్, ఎంపీటీసీ బుడె రాజేశ్వరి రాజబాబు, ఉప సర్పంచ్ డేగ నగేశ్, ఈఓ రమేష్‌తో చర్చించారు. ముందస్తు అంచనాలతో వసతులు కల్పించాలని, రహదారి ఇబ్బందులు, తాగు నీటి వసతి కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. మహా శివరాత్రి సంధర్భంగా ఈ నెల 18 నుండి 20 వరకు నిర్వహించే జాతరలో తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే జాతరలో పారిశుద్య పనులు నిరంతరాయంగా చేపట్టాలని ప్రత్యేక అధికారి ప్రభాకర్‌రావు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అనిల్ కుమార్, పంచాయతి కార్యదర్శి ప్రశాంత్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్



నవతెలంగాణ-మంచిర్యాల

పంచాయతీల కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఐబీ చౌరస్తా నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల పట్ల నిర్లక్ష్యం చేస్తోందని, సమయానికి వేతనాలు ఇవ్వడం లేని అన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధుల వేధింపులు పెరిగిపోయాయని, స్వంత పనులు కూడా చేయాలని ఒత్తిడి తెస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్ని రకాల కార్మికులకు పెంచినట్లుగా పీఆర్సీ ప్రకారం వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాదవశాత్తు మరణించిన వారికి ఇన్సూరెన్స్ అందించాలని అన్నారు. కేటగిరీల వారిగానే పనులు చేయించాలని, జీఓ నెం.60 ప్రకారం పారిశుధ్య కార్మికులకు రూ.15,600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక స్టేటస్ ఇవ్వాలని, పీఎఫ్ ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. తపాల శాఖ ప్రవేశపెట్టిన రూ.399 ప్రీమియాన్ని కలెక్టర్ చొరవ తీసుకొని ప్రతి కార్మికులకు ప్రీమియం చెల్లించి ప్రమాద భీమా చేయించాలని కోరారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని లేని యెడల కార్మికులు మరో సమ్మె పోరాటాన్ని కూడా సిద్ధమవుతారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు అధ్యక్షుడు అవునూరి సాగర్, దుమ్మాల సుధాకర్, జిల్లా కార్యదర్శి చిన్నయ్య, రాజలింగు, జిల్లా ఉపాధ్యక్షులు, రవి, లచ్చక్క, సహాయ కార్యదర్శి సాయి కృష్ణ జిల్లా కోశాధికారి పద్మ, కొమురయ్య, నాయకులు రాజలింగు, నారాయణ, శంకర్, ధర్మయ్య పాల్గొన్నారు.

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న 10 పరీక్షల్లో జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి అశోక్ అధికారులను ఆదేశించారు. మండలంలోని బూరుగుడా జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న రివిజన్ టెస్టుల ఫలితాలను సోమవారం ఉపాధ్యాయులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు టెస్టులు నిర్వహించడంతోపాటు వారు ఏ విషయంలో వెనుకబడి ఉన్నారనే దానిని గుర్తించాలన్నారు. విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం తరఫునుండి స్నాక్స్ వస్తున్నాయని వారికి అందజేసి చదువుపై దృష్టి కేంద్రీకరించేలా చేయాలన్నారు. 100 శాతం ఫలితాలు సాధించడంతోపాటు ఎక్కువ మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించేలా కృషి చేయాలన్నారు. దీనికోసం చిన్నచిన్న చిట్కాలు పాటిస్తే విజయం సులులు అవుతుందన్నారు. వెనుకబడిన విద్యార్థులను ఎప్పటికప్పుడు గుర్తించి వారి అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉదయబాబు ఉన్నారు.

వన్యప్రాణి సంరక్షణ కమిటీ సమావేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని అరణ్య భవనంలో సోమవారం రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వన్య ప్రాణికి సంరక్షణ కమిటీ సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే కోనేరు కోనప్పలు హాజరయ్యారు. జిల్లాలో వన్యప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై మంత్రితో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు సమస్యలు కమిటీ దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో రాష్ట్ర పీసీసీఎఫ్ డోబ్రియల్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి



నవతెలంగాణ-లక్షెట్టిపేట్

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని మండల విద్యాధికారి కాసుల రవీందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో లీడ్ ఇండియా ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం ఆశయాల మేరకు విద్యార్థులు ప్రగతి పథంలో ముందుకెళ్లాలన్నారు. పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థానంలో ఉండాలని విద్యార్థులకు నిర్వహించిన లీడ్ ఇండియా వ్యక్తిత్వ వికాస తరగతులను వినియోగించుకోవాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్న సమయంలో విద్యార్థులకు ఇలాంటి వ్యక్తిత్వ వికాస తరగతులు చాలా అవసరమని తెలిపారు. అబ్దుల్ కలాం ఆశయాలు నెరవేరాలని లీడ్ ఇండియా ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలోనూ నిర్వహిస్తు విద్యార్థులకు శిక్షణ ఇస్తోందని లీడ్ ఇండియా మాస్టర్ ట్రైనర్స్ పి.శ్రీనివాస్, జే.తిరుపతి ఇ.నరసింహ వివరించారు. కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ గౌరవాధ్యక్షులు రమేష్ చంద్ జైన్, డైరెక్టర్లు పెట్టం తిరుపతి, ఎంబడి రమేష్, పాఠశాల ప్రిన్సిపల్ చిందం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన తాసీల్దార్



నవతెలంగాణ-కౌటాల

ఆసిఫాబాద్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన బోర్కాడే హేమవంత్ సహదేవరావ్ ను తాసీల్దార్ ఎండీ మునావర్ శరీఫ్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందించారు. అనంతరం మండల సమస్యలను వారికి వివరించారు.

పాస్టర్స్ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-లక్షెట్టిపేట్

మండల పాస్టర్స్ సహవాస నూతన కమిటీని సోమవారం స్థానిక ఐబీలో ఎన్నుకున్నట్టు తెలిపారు. యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సహవాస కూడిక జిల్లపెల్లి ప్రభుదాసు ఓలీవల ప్రార్థన మందిరంలో గోదావరి కొత్త ప్లాట్స్ కాపరుల సహవాసం నిర్వహించారు. దీనిలో భాగంగా మండలములోని పాస్టర్స్ అందరూ పాల్గొని దేశ రాష్ట్ర క్షేమాభివృద్ధికి ప్రార్థనలు చేశారు. నూతన కమిటీ ప్రెసిడెంట్‌గా పాస్టర్ అవునూరి ఏసన్న, వైస్ ప్రెసిడెంట్‌గా పాస్టర్ సేతు, పాస్టర్ శ్రీధర్, జనరల్ సెక్రెటరీగా చిలుక సతీష్ డానియల్, జయింట్ సెక్రటరీగా జిల్లపల్లి ప్రభుదాస్, కోశాధికారిగా కోడి జోసఫ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్‌గా భాస్కర్ క్రీస్తు దాసు, కమలాకర్, సలహాదారులుగా జుల స్వామీ దాస్, రత్నయ్య, కరుణాకర్‌లను ఎన్నుకోవడం జరిగింది. యునైటెడ్ పాస్టర్ ఫెలోషిప్‌కు గౌరవ అధ్యక్షులుగా రెవరెండ్ ఫాదర్ బొడ్డు రవి జోసఫ్‌ని ఎన్నుకున్నారు.

కేటీఆర్‌ను కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మంత్రి కేటీఆర్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి ప్రగతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు సమస్యలు, నిధులకు సంబంధించిన వివరాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు పేర్కొన్నారు. తాజా రాజకీయాలు కూడా వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిపారు. ఆసిఫాబాద్ పట్టణాన్ని మున్సిపాలిటీగా మార్చడంతో పాటు, రాజంపేటను ప్రత్యేక గ్రామపంచాయతీ మారుస్తూ జీఓ ఇచ్చినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ ఏర్పాటులో బీజేపీది కీలక పాత్ర

నవతెలంగాణ-దహెగాం

గల్లి నుంచి ఢిల్లీ వరకు పోరాటం చేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో భారతీయ జనతా పార్టీ కీలకపాత్ర పోషించిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శక్తి కేంద్రం కార్నర్ సమావేశానికి హాజరై మాట్లాడారు. పార్లమెంటులో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు అనుకూలంగా భారతీయ జనతా పార్టీ ఓటు వేసినందుకే తెలంగాణ రాష్ట్ర ఏర్పడిందని ప్రజలు గమనించాలన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రం ప్రజల అభివృద్ధి సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కోట్లాది నిధులు కేటాయిస్తోందని తెలిపారు. ఒకప్పుడు ఎరువుల కోసం ప్రజలు నానా ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు రైతులకు ఎరువుల బాధలు తీర్చేందుకు రూ.6.300 కోట్లతో మూతపడ్డ రామగుండం ఎరువుల కర్మాగారాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. రూ.8500 కోట్లతో 4000 మెగా వాట్స్‌ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని మంజూరు చేశారని గుర్తు చేశారు. ప్రజాసంగ్రామ యాత్ర ద్వారా బండి సంజయ్ కేసీఆర్ ప్రభుత్వ ఆగడాలు నియోజకవర్గాలలో మంత్రులు ఎమ్మెల్యేలు చేస్తున్న దురాగతలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్నారని తెలిపారు. ప్రజల్ని చైతన్య పరుస్తూ నేరుగా ప్రజల ఇబ్బందులను తెలుసుకుంటూ నిరుద్యోగుల కోసం రైతుల కోసం 317 జీఓ సవరణ కోసం వారికి, ధాన్యం కొనుగోలు కోసం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలైన ఇంటర్మీడియట్ విద్యార్థుల తరఫున పోరాటాలు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీశైలం మండల అధ్యక్యడు ధనుంజయ్, నాయకులు సత్యనారాయణ, మల్లేష్, సురేష్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జిల్లా అధికారులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాకు నూతన కలెక్టర్‌గా గత శనివారం బాధ్యతలు స్వీకరించిన బొర్కాడే హేమంత్ సహదేవరావును సోమవారం జిల్లాలోని వివిధ శాఖల అధికారులు కలిశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా ఎస్పీ సురేష్ కుమార్, అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్ పాయి, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి కృష్ణమూర్తి తన సిబ్బందితో కలిసి మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-సిరికొండ



జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడు ఆశీల దత్తు మాట్లాడుతూ ప్రింట్ మీడియా జర్నలిస్టులు క్షేత్రస్థాయి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులకు, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సేవలందిస్తు, చాలిచాలని లైన్ అకౌంట్లతో జీవితాలను నెట్టుకొస్తున్నామని అన్నారు. మండల కేంద్రంలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇప్పించి, అందులో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు బొడ్డు అనిల్, రసూల్, ప్రవీణ్, మహేష్, రాజేష్ పాల్గొన్నారు.

కష్టపడి చదివితే బంగారు భవిష్యత్తు

నవతెలంగాణ-ఖానాపూర్

ప్రాథమిక విద్యా స్థాయిలో విద్యార్థులు కష్టపడి చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలంగాణ మరుగుజ్జుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పేట్టెం సుధాకర్ అన్నారు. సోమవారం ఖానాపూర్ మండలంలోని ప్రాథమిక పాఠశాల పాత ఎల్లాపూర్ విద్యార్థులకు చదుకోవడం వలన కలిగే ప్రయోజనాలు గురించి అవగాహన కల్పించారు. చదువుకున్న వారు చదువుకొని వారితో పోల్చితే అన్ని రంగాల్లో ముందంజలో ఉంటారని అన్నారు. బాగా చదువుకుని తమకు నచ్చిన రంగాల్లో స్థిర పడాలని విద్యార్థులకు తెలియజేశారు. గతంలో కంటే ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను ప్రారంభించడం వలన విద్యార్థుల నమోదు శాతం పెరిగిందని అన్నారు. బాగా చదువుకొని మీపైన మీ తల్లితండ్రులు పెట్టుకున్న కలలను సాకారం చేయాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్తి మారుతీ స్వామి, సహ ఉపాధ్యాయుడు కిషన్, విద్యార్థులు పాల్గొన్నారు.

జారిపడి వృద్ధుడి మృతి

నవతెలంగాణ-కడెం

ఇంటి వద్ద జారిపడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కోసన రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన గడ్డం తులసయ్య(58) ఇంట్లో నుండి తన పంట చేను వైపు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో ఇంటి ముందర కింద పడి తులసయ్య మృతి చెందినట్లు తెలిపారు. ఘటన స్థలానికి ఖానాపూర్ సీఐ అజయ్ బాబు, ఎస్సై కోసన రాజు చేరుకొని విచారణ చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య ఇటీవల మృతిచెందగా మృతునికి ఒక కొడుకు ఒక కూతురు ఉన్నారు.

ఆడపడుచులకు వరం కళ్యాణలక్ష్మీ పథకం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆడపడుచులకు వరం కళ్యాణలక్ష్మీ పథకమని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా శ్యామ్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా వడగావ్, అందునాయక్ తండ, గ్రామాల్లో పర్యటించారు. లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు. అనంతరం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మొత్తం 74 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను ఆమె చేతులచే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోని ఎక్కడ లేని పథకాలు మన రాష్ట్రంలోని సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో అమలు చేయడం గర్వకారణమని అన్నారు. సంక్షేమ పథకాల్లో మన రాష్ట్రమే నెంబర్ వన్‌లో ఉందని గుర్తు చేశారు. అనంతరం ఈ నెల 20న ఖానాపూర్ నియోజక వర్గంలో మంత్రి కేటీఆర్‌తో పాటు వేముల ప్రశాంత్ రెడ్డి, మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిలు పర్యటిస్తునందున కార్యకర్తలు భారీగా తరలి రావాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట సీపీసీఎస్ చైర్మెన్ మారుతి డొంగ్రె, మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్రీరామ్ నాయక్, ఎంపీపీ పోటె శోభ, సర్పంచ్ కొరేంగా గాంధారి, నాయకులు అంజాద్, సోఫియాన్, వసంత్ రావ్ నాయక్ పాల్గొన్నారు.

ఆరోగ్యలక్ష్మి మెనూ ప్రకారం లబ్ధిదారులకు అందచేయాలి



నవతెలంగాణ-కడెం

ఆరోగ్యలక్ష్మీ పథకం భోజనాన్ని మెనూ ప్రకారం అందజేయాలని పెద్దూరు గ్రామ సర్పంచ్ కే అనూష లక్ష్మణ్ అన్నారు. సోమవారం రెండో అంగన్‌వాడీ కేంద్రంలో ఎల్ఎంసీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక సర్పంచ్ కే.అనూష అంగన్‌వాడీ కేంద్రంలోని పలువురు చిన్నారి విద్యార్థులకు అక్షరభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే అంగన్‌వాడీ లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సరుకులు సక్రమంగా అందించాలని అన్నారు. గర్భిణీ మహిళలు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. అనంతరం జనవరి 26 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అంగన్‌వాడీ కేంద్రం పిల్లలకు నిర్వహించిన వివిధ ఆటల పోటీలలో విజేతలైన చిన్నారులకు సర్పంచ్ కే.అనూష చేతుల మీద బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్‌వాడీ టీచర్ బాలమణి, హెల్పర్ లక్ష్మి, కేంద్రం పరిధిలోని గర్భిణీ మహిళలు, బాలింతలు, చిన్నారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముక్తాపూర్ పీఏసీఎస్ అధ్యక్షులుగా గంగాధర్ ఎంపిక



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ రూరల్ మండలంలోని ముక్తాపూర్ గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులుగా బోండ్ల గంగాధర్ ఏకగ్రీవంగా సోమవారం ఎన్నికయ్యారు. సొసైటీ ఎన్నిక నిర్వహించగా అధ్యక్షులుగా గంగాధర్, ఉపాధ్యక్షులుగా రాజారెడ్డిలు నామినేషన్ దాఖలు చేశారు. రెండు పదవులకు ఒక్కొక్క నామినేషన్ పత్రాలు రావడంతో ఎన్నికల అధికారి సాయినాథ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు వారిని ప్రకటించి, ఎన్నిక ధృవపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈఓ వజీర్, కార్యదర్శి మోహన్‌లు నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను శాలువా, పూలమాలతో సత్కరించారు.

కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏ కంటి సమస్య ఉన్న వారైనా నివారణ కోసం అత్యున్నత నాణ్యత కలిగిన వైద్యం ఖర్చు లేకుండా తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. అంధత్వ నిర్మూలన కోసం ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ సలీమ్, లక్కారం మాజీ సర్పంచ్ తిరుపతి, దావుల రమేష్, శ్రీకాంత్ ఉన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో కొనసాగే పాదయాత్రను ఈ నెల 20న జిల్లాకేంద్రంలో కొనసాగుతుందని దానిని గ్రామపంచాయతీ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్మికుల పాదయాత్ర పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 20న జిల్లా కేంద్రంలో పాదయాత్ర నిర్వహించనున్నామని తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికుల డిమాండ్లపైన రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్న సందర్భంగా ఈనెల 12 నుండి 28వ వరకు 300 కిలోమీటర్లు 17 రోజుల పాటు పాదయాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు. అలాగే 20న అదిలాబాద్ జిల్లా కేంద్రంలో 10కిలోమీటర్ల మేర పాదయాత్ర ఉండనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక సమస్యల పరిష్కారం కోసం వేతనాలు పెంచాలని సదరు యాత్ర చేపట్టినట్లు వివరించారు. ప్రభుత్వం పంచాయతీ కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. సమయానికి వేతనాలు ఇవ్వకుండా ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తుందని అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అందరికీ పీఆర్సీ వర్తింపజేసి, గ్రామపంచాయతీ కార్మికులను మాత్రం విస్మరించడం దుర్మార్గమని

- గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ పాదయాత్ర పోస్టర్ల విడుదల



అన్నారు. జీఓ 51ని అడ్డం పెట్టుకొని గ్రామపంచాయతీ కార్మికులను మల్టీపర్పస్ వర్కర్లుగా మార్చి అనేక వెట్టి చాకిరి పనులు చేయించుకుంటున్నారని అన్నారు. ఆ జీఓను వెంటనే సవరించాలని కోరారు. గ్రామపంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.6లక్షల చొప్పున ఇన్సూరెన్స్ అందించాలని అన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కేటగిరీల వారిగా పనులు చేయించాలన్నారు. జీఓ 60 ప్రకారం పారిశుధ్య కార్మికులకు రూ.15వేల 600ను వేతనాలుగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కారోబారి బిల్ కలెక్టర్లకు ప్రత్యేక స్టేటస్ ఇవ్వాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద భీమా సౌకర్యాలు అమలు చేయాలని సూచించారు. 28న ఇందిరా పార్కులో జరిగే భారీ బహిరంగ సభకు అన్ని గ్రామ పంచాయతీల నుండి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్, సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాస్, జిల్లా కోశాధికారి మేకల అనంతరావు, గ్రామపంచాయతీ జిల్లా ఉపాధ్యక్షులు అడెల్లు, గంగన్న, బాలయ్య, వెంకట్‌రావు, సోనేరావు, గ్రామపంచాయతీ సహాయ కార్యదర్శులు ఇంద్రజ్, నరేష్, అశోక్, దుబ్బాక రాంబాయి, నాయకులు ఎల్లమ్మ, రాజేశ్వర్ పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

వివిధ సమస్యలతో వచ్చిన అర్జీదారుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ భీంరావు అధికారులకు ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో గిరిజన దర్బార్ నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ గిరిజనులు అర్జీలను అందజేశారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం, పంగిడి మాదరం గ్రామానికి చెందిన సోయం లచ్చు తనకు గిరి వికాసం పథకం కింద బోరు, విద్యుత్ మోటారు మంజూరు చేయాలని కోరారు. భీంపూర్ మండలం ఇంద్రనగర్ గ్రామానికి చెందిన ఆత్రం మీరాబాయి తనకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. బీర్సంది గ్రామానికి చెందిన బానావత్ కమలాబాయి ఆర్వోఎఫ్ఆర్ భూమిని వీరాసత్ చేయాలని కోరారు. గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన జె. రమేష్ తనకు స్వయం ఉపాధికి ఋణం మంజూరు చేయాలనీ కోరారు. రైతుబంధు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ



దరఖాస్తులు అందజేశారు. ఆయా అర్జీలను పరిశీలించిన ఏపీఓ శాఖల వారీగా కేటాయించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ దర్బార్‌లో అదనపు వైద్యారోగ్యశాఖ అధికారి కుమురం బాలు, ఏపీఓ పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఓఎస్డీ కృష్ణయ్య, ఏఓ రాంబాబు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీఓ ప్రవీణ్, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణను సందర్శించిన కలెక్టర్



నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వ, జిల్లా పరిషత్ కేజీబీవీ పాఠశాలలకు చెందిన భౌతిక, జీవశాస్త్ర ఉపాధ్యాయులకు ఫిబ్రవరి 10 నుండి 13 వరకు జిల్లా కేంద్రంలోని వశిష్ట పాఠశాలలో టెక్ మహీంద్రా సైన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని కలెక్టర్ వరుణ్ రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులు ప్రయోగాల ద్వారా మరింత సమర్థవంతంగా బోధించటానికి, ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు చక్కగా ఉపయోగపడతాయని అన్నారు. ఈ శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు వారి పాఠశాలలోని విద్యార్థులకు ప్రయోగాలు చేయిస్తూ బోధించాలని పేర్కొన్నారు. అప్పుడే ఈ శిక్షణ ఉద్దేశం నెరవేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులకు రూ.6 వేల విలువ గల సైన్స్ కిట్లను ఉచితంగా అందజేశారు. శిక్షణ కార్యక్రమాన్ని అందజేస్తున్న టెక్ మహేంద్ర సైన్స్ అకాడమీ, సహాయత ట్రస్ట్ వారిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో సైన్స్ అకాడమీ ప్రాజెక్టు డైరెక్టర్ స్రవంతి, విషయ నిపుణులు రేవతి, సత్యానంద్, ఆమీర్ డీఎస్ఓ వినోద్ కుమార్, వశిష్ట పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ రమేష్, సైన్స్ ఫోరం సభ్యులు కూర రమేష్, నారాయణ వర్మ, బచ్చు శ్రీనివాస్, రమాదేవి, అరవింద్, సుదర్శన్ పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి ముందుంటాం

నవతెలంగాణ-బాసర

విద్యార్థుల అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ ముందుంటామని ఆర్జీయూకేటీ యూనివర్సిటీ డైరెక్టర్ సతీష్ కుమార్ అన్నారు. సోమవారం ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ఆర్జీయూకేటీ యూనివర్సిటీ డైరెక్టర్ సతీష్ కుమార్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీరామ్ ప్రారంభించారు. యూనివర్సిటీ డైరెక్టర్ మాట్లాడుతూ ఎఫ్‌డీపీ, పరిశోధన ప్రాముఖ్యతను వివరించారు. యూనివర్సిటీ విద్యార్థుల అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ ముందుంటామని, సీఈఓ చర్చలు, లెక్చర్ సిరీస్‌ల వంటివి ఇప్పటి వరకు నిర్వహించామని అన్నారు. వివిధ సంస్థలతో 16 యంఓయూలు చేశామన్నారు. ఆర్జీయూకేటీ యూనివర్సిటీ మెకానికల్ ఇంజనీరింగ్ సెంటర్ ఫర్ ప్రొడక్ట్ డిజైన్, డెవలప్‌మెంట్ అండ్ అడిటీవ్ మ్యానిఫ్యాక్చరింగ్, ఉస్మానియా విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో వారం పాటు త్రీడీ ప్రింటింగ్, డిజైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల్లోని విద్యాసంస్థల్లో పనిచేస్తున్న 30 మంది పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితునికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



మండలంలోని యాపల్‌గూడ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కొకటి గణేష్ విద్యార్థికి బ్లడ్ క్యాన్సర్ వ్యాధి సోకడంతో హైదరాబాద్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పాఠశాల తరుపున ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు కలిసి రూ.27, 515లను సేకరించి ఎంపీపీ గండ్రత్ రమేష్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ వారి కుటుంబానికి ఎటువంటి అవసరం వచ్చిన తప్పకుండా అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముజాఫర్ హుస్సేన్, ఉపాధ్యాయులు ఎస్ఎంసీ కమిటీ చైర్మెన్ గంట రాములు, ఉపసర్పంచ్ జయంత్, కాంతారావు, కత్తి ఆనంద్, ఎస్‌కే షఫీ, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే విజయం మీదే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలని క్లినికల్ సైకాలజిస్టు, జిల్లా పొగాకు నియంత్రణ విభాగం అధికారి శ్రీకాంత్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ గెజిటెడ్ 1 పాఠశాల విద్యార్థులకు రాబోవు పరీక్షలకు సన్నద్ధత, ఒత్తిడి జయించే మార్గాలు అనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రశాంతమైన మనస్సుతో, ఏకాగ్రతతో పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ప్రత్యేక సమయసారిణి రూపొందించుకుని విషయాల వారీగా ప్రణాళికతో చదవాలని తెలియజేశారు. అర్థంకాని విషయాలను సంబంధిత విషయ నిపుణులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. జీవితంలో పరీక్షలు మాత్రమే శాశ్వతం కాదని అన్నారు. సబ్జెక్టుపై పట్టు సాధిస్తే ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. తద్వారా ఒత్తిడి తగ్గి పరీక్షల్లో మంచి మార్కులు సాధించే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లీలాదేవి, ఉపాధ్యాయులు, పొగాకు నియంత్రణ విభాగం సామాజిక కార్యకర్త చిరంజీవి, విద్యార్థులు ఉన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాకు బదిలీపై వచ్చిన నూతన కలెక్టర్ రాహుల్ రాజ్‌ను సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాలన వ్యవహారాల్లో తమ పూర్తి సహకారం ఉంటుందని పేర్కొన్నారు. అయన వెంట బీజేపీ జిల్లా నాయకులు లాలా మున్న, దినేష్ మటోలియా, ధోని జ్యోతి, వేణుగోపాల్ ఉన్నారు.

బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



నవతెలంగాణ-సారంగాపూర్

బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సగ్గం రాజు అన్నారు, సోమవారం మండలంలోని స్వర్ణ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు అమ్మాయికి, 21 సంవత్సరాలు అబ్బాయికి వచ్చిన తర్వాతనే వివాహాలు చేసుకోవాలని అన్నారు. అనంతరం సూపర్‌వైజర్ విజయ గౌరీ మాట్లాడుతూ పోషణ లోపం లేకుండా ప్రతి ఒక్క అమ్మాయి సమతుల్య ఆహారాన్ని అందరూ తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు రక్తహీనత లేకుండా పండ్లు, పాలు, ఆకుకూరలు ఎక్కువ మోతాదులో తీసుకొని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. అనాథలైన పిల్లలను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అనంతరం అందరూ కలిసి భేటీ బచావో భేటీ పడావో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో 1098 సిబ్బంది రాజ్ కుమార్, పద్మ, ప్రిన్సిపాల్ సంగీత, వార్డెన్ వసంత్, ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అధిక ధరలకు యూరియాను అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-నిర్మల్

అధిక ధరలకు యూరియాను అమ్ముతున్న యజమానులపై చర్య తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గైని మురళీమోహన్ అన్నారు. సోమవారం ఫిర్యాదు విభాగంలో కలెక్టర్ వరుణ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు.జిల్లాలోని పలు ఫెర్టిలైజర్ దుకాణాలలో యూరియా, డీఏపీలను ఉన్న ధర కన్నా ఎక్కువ ధరకు అమ్ముతున్నారని అన్నారు. బిల్లులు సైతం తెల్ల కాగితాలను ఇస్తున్నారని అన్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పలుమార్లు రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయిందన్నారు. వెంటనే సదరు అధికారులను సస్పెండ్ చేయాలని అన్నారు. ధరల పట్టికను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తిమ్మాపూర్ ముత్తన్న, నాయకులు తిమ్మాపూర్ దేవేందర్, మహిరాజ్, గడ్డం దేవన్న, ఏతన్న పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని గొడిసెర గ్రామానికి చెందిన సిందేవార్ సాయబ్‌రావు రైతుకు చెందిన షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం అయ్యింది. గ్రామస్తులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయబ్‌రావు రైతు తన వ్యవసాయ క్షేత్రంలో పండించిన పత్తి పంటకు మద్దతు ధర లేకపోవడంతో ఇంట్లోనే ఉంచాడు. దీని క్రమంలో సాయబ్‌రావు ఆదివారం ఉదయం కుంటాలలో బంధువుల శుభకార్యానికి వెళ్లారు అతని భార్య కూడా గ్రామంలో చుట్టుపక్కల వారి ఇంటికి వెళ్లారు. దీంతో ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఉన్న విద్యుత్ మీటర్ పత్తి వద్ద ఉండటంతో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగడంతో 15 క్వింటాళ్ల పత్తి కాలిపోయింది. ఇంట్లోని బీరువాలో ఉన్న బంగారం, డబ్బులు, బట్టలు, వంట సామగ్రి పిల్లల పుస్తకాలు, అన్ని కాలిబూడిదయ్యాయి. దీంతో ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ఇంట్లో ఎలాంటి వస్తువులు మిగలకుండా కాలిపోవడంతో వారు కేవలం కట్టు కున్న బట్టలతో బయటకు వెళ్లారు. దీంతో రాత్రి చుట్టుపక్కల వారి ఇంటికి వెళ్లి తలదాచుకున్నారు. దీంతో దాదాపుగా రూ.5లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం బాధితుడికి ఆర్థిక సాయం అందించాలని తెలిపారు.

హామీలను విస్మరించిన సీఎం కేసీఆర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో మైనార్టీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిస్థాయిలో విఫలమయ్యారని యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ అధ్యక్షుడు అర్బత్ అహ్మద్ ఖాన్ ఆరోపించారు. పార్టీ పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మోసిన్ పటేల్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి మైనార్టీ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్ కల్పిస్తామని సీఎం ఇచ్చిన హామీ ఇప్పటివరకు నెరవేరలేదని అన్నారు. మైనార్టీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో త్వరలో 24 గంటల నిరాహార దీక్ష చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అన్నూ భాయ్, రసూల్ ఖాన్, కరీం పాల్గొన్నారు.

షర్మిల పాదయాత్రలో ఖానాపూర్ మండల నాయకులు

నవతెలంగాణ-ఖానాపూర్

జనగాం జిల్లాలో కొనసాగుతున్న వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పాదయాత్రలో ఖానాపూర్ వైఎస్ఆర్‌టీపీ నియోజకవర్గ నాయకులు సోమవారం పాల్గొన్నారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ లోకిని రాము, ఖానాపూర్ మండల అధ్యక్షులు బల్గం రవి, సీనియర్ నాయకులు షేక్ అస్గర్‌లు పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గ కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీటీసీలు

నవతెలంగాణ-కోటపల్లి

మండల ఎంపీటీసీలు సోమవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వాటర్స్‌లో చెన్నూర్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలోని నూతనంగా కల్వర్టు నిర్మాణానికి, అలాగే నక్కలపల్లి, బాప్పరం గ్రామల అటవీ ప్రాంతంలో రోడ్డు సౌకర్యం సరిగా లేక ప్రజలు పడుతున్న అవస్థలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎలాగైనా ఫారెస్ట్ క్లియరెన్స్ తెచ్చి రోడ్లు నిర్మించాలని మండల ఎంపీటీసీలు ఎమ్మెల్యేలను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే క్లియరెన్స్ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కోటపల్లి వైస్ ఎంపీపీ వాల శ్రీనివాస్, రాజారాం ఎంపీటీసీ జెకా శేకర్, జనగామ ఎంపీటీసీ మారిషెట్టి తిరుపతి, కొండంపేట ఎంపీటీసీ శంకరయ్య, ఆలుగామ తపాలా శాఖ ఉద్యోగి గోమాస ప్రవీణ్, రాంరెడ్డి, మంత్రి రామయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

నవతెలంగాణ-బెజ్జూర్

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం మర్తేడి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ మోటార్ సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. బెజ్జూరు మండలం నుండి బొంబాయి గూడాకు శుభకార్యానికి వెళ్లివస్తున్న ఎల్లూరి లింగయ్య, దందర బాబాజీ, బుజాడి బాబాజీ మోటార్ సైకిల్ పై వస్తుండగా, ఆదివారం అర్ధరాత్రి అదే సమయంలో ఇసుక ట్రాక్టర్ బెజ్జూర్ నుంచి సులుగు పెల్లికి వెళ్తున్న క్రమంలో మోటార్ సైకిల్ ఢీకొట్టాయి. ఈ ఘటనలో బెజ్జూర్ మండలం తిక్కపల్లి గ్రామానికి చెందిన చెందిన ఏల్లూరు లింగయ్య(38), మహారాష్ట్రకు చెందిన దందర బాబాజీ(55) మృతి చెందగా, పాపన్నపేట గ్రామానికి చెందిన బుజాడి బాబాజీ తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన బాబాజీని కాగజ్‌నగర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు లింగయ్య తండ్రి బాబాజీ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ సయ్యద్ అక్రమ్ అలిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

మెరుగు పడనున్న వైద్య సేవలు

- నియోజకవర్గంలో 8 ఆరోగ్య ఉపకేంద్రాలు
- రూ.1.60 కోట్లు కేటాయించిన వైద్య ఆరోగ్య శాఖ



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ నియోజకవర్గం పరిధిలో గల మారుమూల గ్రామీణ ప్రాంతాల వారికి వైద్య సేవలు మరింతగా మెరుగు పడతాయని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ తెలిపారు. నియోజకవర్గం పరిధిలో గల అంగ్రాజుపల్లి, సోమన్‌పల్లి, కుందారం, షెట్‌పల్లి, పిన్నారం, ఇందారం, ఆల్గామ్, కత్తెరశాల గ్రామాల్లో ఉప ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయుటకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని తెలిపారు. రూ.20 లక్షల చొప్పున 8 ఉప ఆరోగ్య కేంద్రాలు నిర్మించుటకు వైద్య ఆరోగ్యశాఖ ద్వార ఉత్తర్వులు వెలువడినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల వారికి మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తేవడానికి జనాభా ప్రాతిపదికన ముందస్తుగా గుర్తించిన విధంగా ఉప ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లకుండా స్థానికంగా అత్యాధునిక వసతులతో ఉప ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతోందని వివరించారు. గడిచిన 60 సంవత్సరాల్లో గత పాలకులు ఎవ్వరు చెన్నూర్ నియోజకవర్గాన్ని పట్టించుకున్న దాకలాలు వేవని విద్య, వైద్యం, రవాణా వంటి కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫమైనట్లు తెలిపారు. నియోజకవర్గం కేంద్రంలో రూ.40 లక్షలతో 100 పడకలతో నిర్మించబోతున్న ఆసుపత్రి భవన నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేయనున్నామని, అడిగిన వెంటనే నియోజకవర్గం పరిధిలో ఉప ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు నిధులు విడుదల చేసిన సీఎం కేసీఆర్, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



నవతెలంగాణ-రెబ్బెన

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని అత్యున్నత స్థాయికి ఎదగాలని తిర్యాని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రిన్సిపాళ్ళ సంఘం రాష్ట్ర నాయకులు లక్ష్మణరావు అన్నారు. మండలంలోని ఇంద్రనగర్ వద్దగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శంకర్ అధ్యక్షతన విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను పెంచుకోవాలని సూచించారు. జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడినప్పుడే ఉపాధ్యాయులుగా తమకు ఎంతో సంతోషం కలుగుతుందన్నారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. అంతకుముందు ప్రిన్సిపల్ శంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం కళాశాలలో స్పోర్ట్స్ డే సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడల్లో ప్రథమ ద్వితీయ బహుమతులు పొందిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. ముఖ్య అతిథులను కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర అధ్యాపకుడు తిరుపతి, బెల్లంపల్లి కళాశాల జూనియర్ అసిస్టెంట్ శ్రీలేఖ, కళాశాల అధ్యాపకుడు సతీష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృత కార్యక్రమాలు

వీడ్కోలు వేడుకల సందర్భంగా విద్యార్థులు చేసిన నత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కళాశాలలోని వివిధ గ్రూపులకు చెందిన విద్యార్థులు జ్ఞానేశ్వరి, శ్రీవిద్య అరుణ, అనూష, సోనీ, శ్రావణ్, దీపక్, ప్రశాంత్‌తో పాటు పలువురు విద్యార్థులు వివిధ పాటలపై నృత్యాలు చేశారు.

తాగు నీరు, రోడ్డు సౌకర్యం కల్పించాలి



నవతెలంగాణ-కెరమెరి

తాగునీరు, రోడ్డు సౌకర్యం కల్పించాలని సోమవారం మండలంలోని బోలా పటార్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాంనగర్ గ్రామస్తులు సర్పంచ్ వాగ్మరే శివాజీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ సత్యనారాయణగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాగ్మరే శివాజీ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రాంనగర్ గ్రామస్తులు తాగునీటికీ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రాకపోకలకు గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు, ఐదేళ్ల లోపు పిల్లలకు పౌష్టికాహారం అందడం లేదని వాపోయారు. గతంలో పలు మార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలాజీ, కేర్బా, భగవత్, సురేష్, జలపతి పాల్గొన్నారు.

ద్వారకాపూర్‌లో కంటి వెలుగు

తాండూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమం ద్వారకాపుర్ గ్రామపంచాయితీలో సర్పంచ్ మాసాడీ శారదా, ఎంపీపీ పూసల ప్రణయ్ కుమార్, జడ్పీటీసీ సాలిగామ బానయ్య కలిసి కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. కంటి సమస్యలు ఉన్నవారికి అద్దాలు పంపిణీ చేసినట్లు మెడికల్ ఆఫీసర్ అనిల్ తెలిపారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారు డాక్టర్ సూచన మేరకు తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కంటి అద్దాల వాడుకలో సరియైన విధానాన్ని పాటించినట్లయితే అద్దాలు మన్నికగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో తాండూర్ మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్, పంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్, సర్పంచ్ అప్ప రమేష్, వార్డుమెంబర్ చంద్రగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సీపీఐ నిరసన



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ సోమవారం స్థానిక ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధానికి ప్రభుత్వ రంగ సంస్థలు కట్టబెడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేటు పరం చేస్తూ అధానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అధాని మీద మని లాండరింగ్ కేసు నమోదు చేసి జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మిట్ట పెల్లి శ్రీనివాస్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎండీ అక్బర్ అలీ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఇప్పకాయాల లింగయ్య, సీపీఐ జిల్లా సమితి సభ్యులు మిట్టపెల్లి పౌల్, కాదండీ సాంబయ్య, నాయకులు దుర్గం దేవదాస్, ఎగుడ మొండి, మరపెల్లి రవి, తోకల రాజయ్య, రాజ కొమురయ్య పాల్గొన్నారు.

తాండూర్ : పేద ప్రజలు భవిష్యత్ అవసరాల కోసం ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తున్న నగదును ప్రభుత్వం కార్పోరేటర్లకు దోచి పెట్టే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని సీపీఐ మండల కార్యదర్శి శాలిగామ సంతోష్ ఆరోపించారు. సోమవారం మండలంలోని స్థానిక ఎస్‌బీఐ బ్యాంక్ సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మామిడాల రాజేశం, కొడిప్యాక భాస్కర్, త్రీఇంక్లైన్ టౌన్ సెక్రెటరీ వాసాల నాగరాజు, సన్యాసి రాజయ్య, భీమేష్, ఎడ్ల బాపు పాల్గొన్నారు.

చట్ట సభలలో బీసీ రిజర్వేషన్లపై కేసీఆర్ పోరాడాలి



నవతెలంగాణ-జన్నారం

చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు బీసీల తరపున కేంద్ర ప్రభుత్వంతో సీఎం కేసీఆర్ పోరాడాలని బీసీ సంక్షేమ సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరు చంద్రయ్య కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన బీసీ కులాల సంక్షేమ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినప్పటికీ చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్లు లేకపోవడం వలన వందలాది బీసీ కులాల వారు ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా చట్టసభలలో అడుగుపెట్ట లేక పోతున్నారన్నారు. 75 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న కాంగ్రెస్, బీజేపీలు స్వార్థ పూరిత రాజకీయాలతో బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. దేశంలో ప్రతి ఉద్యమం వెనుక అగ్రవర్ణాల అండదండలతోనే కార్మికులు, రైతు కూలీల, రైతుల ఉద్యమాల వలననే హక్కులు సాధించుకోవడం సమస్యలు పరిష్కరించుకోవడం జరుగుతుందన్నారు. కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం 2001లో ప్రారంభించి 2014లో సాధించగలిగారన్నారు. కేసీఆర్ నాయకత్వం పటిమ అటువంటిది అన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జాతీయ స్థాయిలో రాజకీయాలలో మార్పు తీసుకురావడానికి కేసీఆర్ టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చారన్నారు. అన్ని రాష్ట్రాలలో పార్టీని విస్తరించడానికి సభలు సమావేశాలు నిర్వహించ బోతున్నామన్నారు. తెలంగాణ ప్రజల కోసం రైతుబంధు, రైతు బీమా మొదలగు పథకాలను ప్రచారం చేస్తూ దేశ స్థాయిలో ప్రజల మెప్పు పొందడం కష్టమైన పని వీటికి తోడుగా చట్ట సభలైన అసెంబ్లీ పార్లమెంటులలో బీసీ కులాల వారికి రిజర్వేషన్లు కావాలనే డిమాండ్‌ను తీసుకొని ముందుకు వెళితే 60 శాతం బీసీ జనాభా గల వారిని ఆకర్షించి జాతిపితగా అవతరించే అవకాశం అతి సమీపంలో ఉందన్నారు. కొండగట్టుకు సీఎం కేసీఆర్ వస్తున్న నేపథ్యంలో వారిని కలువనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీసీ సంఘ పోరాట సమితి నాయకులు, మామిడి విజయ్, కే ఏ నరసింహులు, కాసెట్టి లక్ష్మణ్, ఆడేపు లక్ష్మీనారాయణ, శ్రీరాముల గంగాధర్, అయిలవేణి నరసయ్య, దండవేణి చంద్రమౌళి, సిరవేణి పెద్దిరాజం, మూల భాస్కర్ గౌడ్, జంగం సంతోష్ పాల్గొన్నారు.

అగ్నిమాపక పరికరాలపై అవగాహన



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఆర్ కె1ఏ గనిపై సోమవారం అగ్ని మాపక పరికరాల వ్యవస్థ, భద్రతపై అవగాహన తనిఖీ పక్షోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గని యాక్టింగ్ మేనేజర్ బి.జయంత్ కుమార్ మాట్లాడుతూ అగ్ని మాపక పరికరాలు వాడే విధానం ప్రతి ఉద్యోగి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రతి కార్మికుడు రక్షణతో పనిచేయాలని సూచించారు. అనంతరం కార్మికులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గని పిట్ ఇంజనీర్ ఎం.సతీష్, టీబీజీకేఎస్ పిట్ సెక్రెటరీ బండారి బిక్షపతి, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ సురమల్ల వినయ్ కుమార్ పాల్గొన్నారు.

నస్పూర్ : గనిలో కార్మికులు, ఉద్యోగులు అగ్నిమాపక పరికరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్ఆర్పి3,3ఏ సంతోష్ కుమార్ అన్నారు. అగ్నిమాపక పరికరములు, వ్యవస్థ భద్రత అవగాహన తనిఖీ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం రెస్క్యూ ఇన్‌ఛార్జి రామ్మోహన్‌రావు అవగాహన కల్పించారు. రెస్క్యూ బ్రిగేడియర్ సంపత్ గనిలోని ఉద్యోగులకు అగ్ని ప్రమాదం జరిగినప్పుడు పరికరాలను ఎప్పుడు, ఎక్కడ, ఎలా వాడాలో వివరించారు. అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండి, వ్యక్తిగత భద్రత పాటిస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని మేనేజర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గని ఫిట్ సెక్రటరీ రిక్కల గోపాల్, రక్షణ అధికారి చంద్ర ముర్ము, పిట్ ఇంజనీర్ ప్రేమ్ కుమార్, వెంటిలేషన్ ఆఫీసర్ అరుణ్ కుమాం పాల్గొన్నారు.

గ్రామాల్లో బ్యాంకు సేవలు విస్తృతం



నవతెలంగాణ-తాండూర్

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ గ్రామాల్లో సంస్థ సేవలను విస్తృతం చేస్తుందని మేనేజర్ ప్రభుదాస్ అన్నారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన సీఎస్పీల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ తమ సేవలను విస్తృతం చేసే విధంగా గ్రామ పంచాయతీల పరిధిలో సీఎస్పీలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఖాతాదారులు సిఎస్పీల వద్ద నగదు నిల్వలు, డిపాజిట్లు, నగదు ఉపసంహరణ చేసుకోవచ్చుని తెలిపారు. తాండూరు మండలంలో ద్వారకాపూర్, గోపాల్ నగరం, అచలాపూర్, రేచిని చౌటపల్లి, మాదారం, తాండూర్ గ్రామాలలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సీఎస్పీలు పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. సీఎస్పీలు వ్యవసాయ రుణాల వసూలు రీ షెడ్యూల్ పిక్స్‌ల సేకరణ, బంగారు ఆభరణాలపై రుణాలు సీనియర్ సిటిజనర్లకు చెల్లించే వడ్డీ వివరాలు స్వయం సహాయక బృందాల రుణాల సేకరణ, పొదుపు వంటి అంశాలలో సలహాలు అందించడమే కాకుండా గ్రామాల్లో తమ పరిధిలోగల బ్యాంకు లావాదేవీలను నిర్వహిస్తారని సూచించారు. కాతాదారులు సేవలను వినియోగించుకోవాలని కోరారు. గ్రామాల్లో లావాదేవీలు నిర్వహించడం వల్ల వినియోగదారుల సమయం ఆదా అవుతుందని తెలిపారు

భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

నవతెలంగాణ-నస్పూర్

మహాశివరాత్రి సందర్భంగా మున్సిపల్ పరిధిలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ మున్సిపల్ సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక సీతరాంపల్లె చౌరస్తా నుంచి పుష్కర ఘాట్ వరకు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంబాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతరాంపల్లె చౌరస్తా నుంచి గోదావరి పుష్కర ఘాట్ వరకు రూ.12.35 లక్షలతో 80 కరెంట్ స్తంబాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజల సౌకర్యార్థం స్నానపు గదులు, పార్కింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్, మున్సిపల్ అధికారులు ఆర్ఓ సతీష్, మోహన్ పాల్గొన్నారు.

ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-భీమారం

ప్రభుత్వ పరమైన సమస్యల పరిష్కారానికి ప్రజలు ప్రజావాణి ఫిర్యాదుల విభాగాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా శిశు సంక్షేమాధికారి చిన్నయ్య సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ శ్రీనివాస్, సీడీపీఓ సూపర్వైజర్ రజితతో కలిసి మండలంలోని భీమారం, బూరుగుపల్లి, ధర్మారం, రెడ్డిపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాలలో రోజువారి హాజరు పట్టిక, మెను రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళ శిశు సంక్షేమం కోసం ఏర్పాటు చేస్తున్న అంగన్‌వాడీ సెంటర్లలో పరిశుభ్రత లోపం లేకుండా చూసుకోవాలని సంబంధిత నిర్వాహకులను ఆదేశించారు. అదేవిధంగా గర్భిణీలు, బాలింతలు, పిల్లల హాజరు శాతం పడిపోకుండా, ప్రభుత్వం అందించే పౌష్టిక ఆహారాన్ని మెను ప్రకారం అందేలా చూసుకోవాలని అన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యను పరిష్కరించడంలో విఫలమైందని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా ఉప అధ్యక్షుడు అబ్దుల్ జమీల్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు ఐక్య పోరాటాలు చేసి తమ హక్కులు సాధించుకోవాలని, సిర్పూర్(టి)మండల కేంద్రంలోని దీర్ఘకాలికంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దశల వారి ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా నిరసన చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి ధనుంజయ్, పాత్రికేయులు తులసిదాసు, కృష్ణ, రాజశేఖర్, రవీందర్, కబీర్, శ్రీధర్, రిజ్వాన్, సుమన్ ప్రశాంత్, శంకర్ పాల్గొన్నారు.

సమావేశాలకు పయనమైన డీవైఎఫ్ఐ నాయకులు



నవతెలంగాణ-రెబ్బెన

డీవైఎఫ్ఐ రాష్ట్ర విస్తత స్థాయి సమావేశాలు మంగళ, బుధవారంల్లో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న నేపథ్యంలో సోమవారం ఆ సంఘం నాయకులు బయలుదేరారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకురి సతీష్ మాట్లాడుతూ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సమావేశాల్లో చర్చ ఉంటుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి బడ్జెట్ చూస్తే యువతకు జరుగుతున్న అన్యాయాలు అర్థమవుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. ఈ సమావేశాల్లో యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లపల్లి రాజేశ్వర్, రేగళ్ల గణేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం

- సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా, బడ్జెట్ ప్రతుల దహనం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర బడ్జెట్లో బీసీలకు ప్రభుత్వం కేవలం రెండు శాతం మాత్రమే కేటాయించి అన్యాయం చేసిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఆదిలాబాద్ ఎక్స్ రోడ్, అంబేద్కర్ చౌక్ వద్ద బడ్జెట్ ప్రతులు దగ్ధం చేసి, కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో దాదాపు 60 శాతం ఉన్న బీసీలకు కేవలం రెండు శాతం మాత్రమే బడ్జెట్ కేటాయించి ప్రభుత్వం బీసీలపై సవతి తల్లి ప్రేమ చూపిచిందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బీసీలకు సరైన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు గాజుల జక్కయ్య, వైరగడే మారుతి, కోట వెంకన్న, పురుషోత్తం, బాలేష్, రాధిక, లలిత, ప్రహ్లాద్, గడ్డల ప్రణయ్, సాయికృష్ణ, మిట్ట పోషన్న, లాహు కుమార్, ఆవిడపు ప్రణయ్ పాల్గొన్నారు.

నర్సరీ కార్మికుల వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-రెబ్బెన

ఫారెస్ట్ నర్సరీలో పనిచేస్తున్న కార్మికులకు రావాల్సిన పెండింగులో వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం రెబ్బన ఫారెస్ట్ నర్సరీ కార్మికులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, అలాగే కనీస కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. 10 సంవత్సరాల నుంచి మహిళా కార్మికులు పనిచేస్తున్నారని, వీరంతా కూడా చాలీచాలని వేతనాలు తీసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకోవడంలో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. మార్కెట్‌లో ప్రతిరోజు నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.250 రోజు కూలీతో కుటుంబాన్ని పోషించుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనె కార్మికుల కూలి రేట్ పెంచాలని డిమాండ్ చేశారు. రవాణా ఖర్చులు చెల్లించాలి అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. నర్సరీ కార్మికులకు ఎక్స్‌గ్రేషియా రూ. 20 లక్షలు కల్పించాలి, ప్రతి కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

రక్తదానం చేయడమంటే మరోప్రాణాన్ని రక్షించడమే..



నవతెలంగాణ-నస్పూర్

రక్తదానం చేయడం అంటే మరోప్రాణాన్ని రక్షించినట్లేనని జనరల్ మేనేజర్ త్యాగరాజు అన్నారు. సోమవారం వృత్తి శిక్షణా కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న ఉద్యోగులు సోమవారం ఆర్కే8 డిస్పెన్సరీలో రక్తదానం చేశారు. రక్తదానం చేసిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ అన్ని దానముల కన్నా రక్తదానం గొప్పదని అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో ఈ సంవత్సరం 13 రక్తదాన శిబిరాలు నిర్వహించి మొత్తం 560 యూనిట్ల రక్తం రెడ్ క్రాస్ సొసైటీ వారికి అందజేశామని తెలిపారు.కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎంపీటీసీ ఎస్ఓఎం కల్లూరి వెంకట రామారావు, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ పి.రమేష్ బాబు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకనాథ్ రెడ్డి, వృత్తి శిక్షణ కేంద్రం శిక్షకులు రాజ్ కుమార్ పాల్గొన్నారు.

www.navatelangana.com
నవతెలంగాణ
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 14 ఫిబ్రవరి 2023

గ్రామాభివృద్దే ప్రధాన లక్ష్యం : సర్పంచ్

నవతెలంగాణ-సారంగాపూర్



గ్రామాభివృద్దే ప్రధాన లక్ష్యమని గ్రామ సర్పంచ్ సుజాత నర్సారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జెండాగల్లిలో రూ.10 లక్షల ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు సుమారు రూ.50 లక్షల నిధులతో సీసీ రోడ్డు, మురికికాలువ, పనులు చేపట్టామని అన్నారు. రాబోయే రోజుల్లో అన్ని వీధుల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. గ్రామ ప్రజలు రోడ్లపై చెత్త వేయకుండా పంచాయతీ ట్రాక్టర్‌లోనే వేసి పరిశుభ్రతను పాటించి, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని గ్రామస్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ దేవి ముత్యం, పంచాయతీ సెక్రటరీ గోపి కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్ కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు

నవతెలంగాణ-తాంసి



వితంతువులు, వికలాంగులు, వృద్ధులు, అర్హులైన లబ్దిదారులు ఆసరా పెన్షన్ కోసం మండల పరిషత్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు సోమవారం హస్నాపూర్ గ్రామానికి చెందిన మహిళలు కార్యాలయానికి వచ్చి ఎంపీడీఓను కలిసి తమకు ఎందుకు పెన్షన్ రావడం లేదని మొరపెట్టుకున్నారు. వారు తమ గోడును వినిపించారు. గత మూడు సంవత్సరాల క్రితం ఆసరా పెన్షన్ కోసం ధరఖాస్తు చేసుకున్నామని అన్నారు. పెన్షన్ కోసం అర్హత ఉన్నపటికీ ఇప్పటి వరకు పెన్షన్ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధుల, అధికారుల, చుట్టూ తిరుగుతున్న మమ్ములను పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఫిబ్రవరి 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈఓ డా.శ్రీధర్ సుమన్ సూచించారు. సోమవారం పరీక్షలకు సంబంధించి నిర్వాహకులకు తన కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షల్లో భాగంగా జనరల్, ఒకేషనల్ సబ్జెక్టులకు గాను జిల్లా వ్యాప్తంగా 23 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసామని, పరీక్షా కేంద్రాల ఛీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్ మెంటల్ అధికారులను కేటాయించామన్నారు. జనరల్ 20, ఒకేషనల్ 3 కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు పూటలా ప్రయోగ పరీక్షలు నిర్వహించాలని అన్నారు. పరీక్షకు ఒక అరగంట ముందు అనగా 8:30 గంటల నుండే పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలని ఖచ్చితంగా సమయపాలన పాటించాలని అన్నారు. ఇంటర్ బోర్డు నియమావళికి లోబడి సబ్జెక్టు పరీక్షకులు ఏ పూటకాపూట మార్కులు నమోదు చేయాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఫస్ట్ ఇయర్ జనరల్ విద్యార్థులు 2713, ఒకేషనల్ 1463 విద్యార్థులు మొత్తం 3410 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షల సందర్భంగా వైద్య, రెవెన్యూ, పోస్టల్ తదితర సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని అన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు నైతం శంకర్, తిరుపతి పాల్గొన్నారు.

ప్రజలు నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రజలు నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన పిర్యాదుల విభాగంలో ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని అన్నారు. ప్రజా సమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజాదివస్ కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామని అన్నారు. అనుమానస్పదంగా వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని దృష్టికి వచ్చిన, వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేయాలని అన్నారు. లేదా జిల్లా వాట్సప్ నెంబర్ 8712659599కు సమాచారం తెలియజేయాలని ప్రజలను కోరారు.

సమిష్టిగా జిల్లా అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమిష్టిగా జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ సహదేవ్‌రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లోని ధరణి కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆర్‌డీఓ కార్యాలయంలో పోడు పట్టాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి అందరం సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ రమేష్, సీపీఓ రవీందర్, డీఐఈఓ శ్రీధర్ సుమన్, డీఏఓ శ్రీనివాసరావు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి మణెమ్మ, డీఆర్‌డీఓ సురేందర్, డీఓస్ఓ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌పీఓ ప్రభాకర్‌రావు సూచించారు. ఎంపీడీఓ సత్యనారాయణతో కలిసి సోమవారం నర్వ గ్రామంలో కంటి వెలుగు పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని కంటి సమస్య ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా పరీక్షా కేంద్రానికి వచ్చిన వారిలో అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అనిల్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

గ్రామ పంచాయతీ కార్మికులకు గత 4 నెలలుగా పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని సోమవారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు లేక పోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు గడవలేని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. కార్మికులకు ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు విడుదల చేయాలని అన్నారు. 11వ పీఆర్సీ వర్తింప చేసి, 30 శాతం వేతనం పెంచాలని అన్నారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీఓ నెం 51 రద్దు చేయాలని అన్నారు. మున్సిపాలిటీ కార్మికులకు ఏ విధంగా వేతనాలు ఇస్తున్నారో, అదే విధంగా గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వాలన్నారు. సబ్బులు, యూనిఫామ్, బెల్లం, నూనె ఇవ్వాలని అన్నారు. ఆదివారం సెలవు ఇవ్వాలన్నారు. ప్రజాప్రతినిధులు బెదిరింపులు, అధికారుల వేధింపులు అరికట్టాలని అన్నారు. సమస్యలపై ఈ నెల 16న దస్తురాబాద్ మండలంలో గ్రామ పంచాయతీ కార్మికులు పాదయాత్ర నిర్వహించటం జరుగుతుందన్నారు. అలాగే పెంబి, కడెం, ఖానాపూర్ మండలాలలో పాదయాత్ర నిర్వహిస్తామని అన్నారు. సమావేశంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షులు నరపక నర్సయ్య, నాయకులు రాజేందర్, మల్లేష్, రాజేష్, రాములు, నర్సయ్య, లక్ష్మణ్, గంగయ్య రాజన్న, నవీన్, సాయన్న, బోరవ్వ, గంగవ్వ, అనిత పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ నియమాలు ఉపసంహరించుకోవాలి



నవతెలంగాణ-నిర్మల్

అటవీ హక్కులను నిర్వీర్యం చేసే అటవీ సంరక్షణ నియమాలు-2022 ను ఉపసంహరించుకోవాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నందిరామయ్య అన్నారు. సోమవారం అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో గాంధీ పార్క్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. డీఆర్ఓ లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అడవులను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడానికి, అటవీ హక్కులను నిర్వీర్యం చేయడానికి, అటవీ సంపదలను దోచిపెట్టడానికి అటవీ సంరక్షణ నియమాల పేరుతో-2022ను తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ నియమాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అటవీ హక్కుల నియమాలు అమల్లోకి వస్తే 2006 అటవీ హక్కుల చట్టం నిర్వీర్యం అవుతుందన్నారు. గిరిజనులు పోరాడి తెచ్చుకున్న పీసా చట్టం నిర్వీర్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా అటవీని, పోడు భూమిని నమ్ముకుని పోడు వ్యవసాయం చేస్తున్నటువంటి ఆదివాసీ గిరిజనులకు హక్కు లేకుండా పోతుందని అన్నారు. ఈ నియమాలు కార్పొరేట్ సంస్థలకు ఉపయోగపడతాయని అన్నారు. పేద గిరిజనులకు ఏమాత్రం ఉపయోగపడవని అన్నారు రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ఈ అటవీ నియమాలను రద్దు చేయాలని, అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. అలాగే పోడు భూములకు పట్టాలిస్తామని అనేకమార్లు అసెంబ్లీలో ప్రకటించిన కేసీఆర్ ఇటీవల జరిగినటువంటి అసెంబ్లీలో పోడు సాగుదారులను, ఆదివాసీ గిరిజనులను, ఆదివాసీ చట్టాలను కించపరిచే విధంగా మాట్లాడారని అన్నారు. ఆదివాసుల హక్కులను హరించి వేసే విధంగా, ఆదివాసులకు హక్కే లేదని పద్ధతిలో అసెంబ్లీలో మాట్లాడినటువంటి కేసీఆర్ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఒకవైపు పట్టాలిస్తామని, ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ప్రజలని మభ్యపెట్టి దరఖాస్తులు తీసుకొని శాటిలైట్ సర్వే పేరుతో గిరిజనులకు, ఆదివాసులకు ఇతర పేదలకు అన్యాయం చేసే విధంగా హక్కులు రాకుండా చేసే విధంగా శాటిలైట్ సర్వేను ముందుకు తీసుకొచ్చినటువంటి ఘనత కేసిఆర్‌కే దక్కిందన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ ప్రభుత్వం గిరిజనుల హక్కులను, పోడు సాగుదారుల హక్కులను గుర్తించాలన్నారు. 2006 అటవీ హక్కుల చట్టంతో పాటు పీసా చట్టాన్ని గుర్తించాలని అన్నారు. గిరిజనులను అవమానపరిచే చర్యలు మానుకోవాలని అన్నారు. వెంటనే పోడు సాగుదాలందరికి గిరిజనులకు ఇతర పేదలందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా ఫిజికల్ సర్వే నిర్వహించి, సాగులో ఉన్న ప్రతి ఒక్కరికి పట్టాలు ఇవ్వాలని అన్నారు. అదేవిధంగా జిల్లాలో కౌట్ల (బి), మలక్‌చించొలి, జౌళి ఇతర గ్రామాల్లో పేదలు సాగు చేసుకుంటున్నాటువంటి భూములకు సర్వే చేసి పట్టాలి ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) డేమోక్రసీ ప్రజపంథా జిల్లా కార్యదర్శి కె.రాజన్న, ఏఐపీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మడావి అంకుశ్ రావు, సీపీఐ(ఎంఎల్) న్యూ డేమోక్రసీ ప్రజపంథా జిల్లా నాయకులు ఆర్ రామలక్ష్మణ్, పీఓడబ్ల్యూ జిల్లా నాయకులు ఎస్. గంగన్న, ఏఐపికేఎస్ జిల్లా నాయకులు జక్కుల రాజన్న, కుంచపు ఎల్లయ్య, మహమూద్, వర్మ, ఎస్.లక్ష్మి, భూమన్న ముత్యం, హనుమంతు పాల్గొన్నారు.

చెరువు శిఖం భూములను రక్షించండి

నవతెలంగాణ-ముధోల్



చెరువు శిఖం భూములు అక్రమణకు గురికాకుండా రక్షించాలని సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు విభాగంలో తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌కు వినతిపత్రం అందించారు. ప్రతి సోమవారం ప్రజల నుండి వినతులను స్వీకరించేందుకు ఫిర్యాదులు విభాగాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ముధోల్ సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, స్థానికులు ఆసుపత్రిలో చికిత్సలు ప్రారంభించాలని కోరారు. అదేవిధంగా శస్త్ర చికిత్స నిపుణులను నియమించాలని పేర్కొన్నారు. శస్త్ర చికిత్సలు నిలిచి పోవడం వల్ల ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని వెల్లడించారు. స్థానిక చెరువుల తూము, అలుగు సరిగ్గా లేకపోవడంతో నీటిపారుదల లేక రైతులు నష్టపోతున్నారని వాపోయారు. తహసీల్దార్ శ్యాంసుందర్ వెంటనే స్పందించి సమస్యని పరిష్కరించాలని ఇరిగేషన్ ఇంజనీర్‌ను ఆదేశించారు. అదేవిధంగా ఫిర్యాదుల విభాగానికి వైద్య శాఖ అధికారులు సైతం హాజరుకావాలని అన్నారు. ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు తిరిగి ప్రారంభమయ్యే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్షయ నివారణ యూనిట్ల పరిశీలన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

కేంద్ర ప్రభుత్వం క్షయ నివారణ కోసం బాధితులకు నిక్షయ్ పోషణ్ అభియాన్‌లో భాగంగా పౌష్టికాహారం కోసం అందజేసిన ఆర్థిక సాయం, ప్రయోజనాలపై చెన్నై నుంచి వచ్చిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎపిడెమాలజీ బృందాలు సంయుక్తంగా జిల్లాలో చేపట్టిన అధ్యయనం సోమవారంతో ముగిసింది. ఈ నెల ఆరో తేదీ నుంచి బృందం జిల్లాలోని అదిలాబాద్ గ్రామీణ మండలంలోని అంకోలి, భీంపూర్, తలమడుగు, ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలోని దంతన్‌పల్లి, హస్నాపూర్, ఇంద్రవెల్లి పీహెచ్‌సీ పరిధిలోని చాందా(టి), రాంపూర్, భీంసరి, అర్లి(బి) తదితర గ్రామాలలో డీబీటీ లబ్ధిదారులు 115 మందిని కలిసి అధ్యయనం కొనసాగించింది. వారికి ప్రభుత్వపరంగా పౌష్టికాహారం కోసం నెలవారీగా 2021లో రూ.500 చొప్పున అందించిన ఆర్థిక సాయం ఎలా ఉపయోగపడిందో వివరాలను సమీక్షించారు. ఈ బృందంలోని సభ్యులు కళ్యాణి, మెర్క్యూరీ, అపర్ణ, విశేష్, రవీందర్, జయశ్రీ అన్ని వివరాలను నేరుగా లబ్ధిదారుల నుంచి సేకరించారు. నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందించనున్నట్టు తెలియజేశారు.

పట్టణ ప్రగతి పనులను పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-నిర్మల్

పట్టణ ప్రగతి పనులను కలెక్టర్ వరుణ్ రెడ్డి సోమవారం పరిశీలించారు. స్థానిక ఇసుర్రాళ్ళ గుట్ట వద్ద నిర్మిస్తున్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ సంపును పరిశీలించారు. త్వరగా పూర్తి చేసి రాబోయే వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. వెంకటాద్రి పేటలోని వైకుంఠ దామాలను పరిశీలించి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు. పార్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. పట్టణ ప్రకృతి వనాలు సందర్శించి, ప్రణాళిక ప్రకారం మొక్కలను నాటి సంరక్షించాలని అన్నారు. పట్టణ ప్రకృతి వనం సరిగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. 1, 2, 3, 5, 6 వార్డులలో సందర్శించి డ్రైనేజీలను పరిశీలించారు. ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. వారంలోగా ప్రకృతి వనాల ఏర్పాటు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆయా వార్డు కౌన్సిలర్‌లు, సంబంధిత ఎఈలు ఉన్నారు.

16న ఆశాల చలో హైదరాబాద్

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆశాల సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈ నెల 16న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ తెలిపారు. కాగజ్‌నగర్ వైద్యాధికారి అశ్వినికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆశాలకు నిర్ణిత వేతనం, ఇతర సమస్యల పరిష్కారం కోసం, తగిన బడ్జెట్ కేటాయించాలని కోరారు. ఆశాలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నట్లు నిర్ణిత వేతనం రూ.10వేలు వెంటనే నిర్ణయం చేయాలన్నారు. ఆశాలకు పీఎఫ్, ఈఎస్ ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని, 2022 డిసెంబర్ 6 నుండి నిర్వహించిన లెప్రసీ సర్వేకు ప్రభుత్వం అదనంగా డబ్బులు చెల్లించాలని అన్నారు. 2023 జనవరి 18 నుండి నిర్వహించిన కంటి వెలుగు పనికి అదనంగా డబ్బులు చెల్లించాలని, గతంలో ఆశాలు నిర్వహించిన లెప్రసీ, కంటివెలుగు పెండింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగరం పద్మ, లక్ష్మి, అనిత, జ్యోతి, కవిత, లక్ష్మి ఆశాలు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాల్లో 18ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని వైస్ ఎంపీపీ మామిడి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ధర్మోర, వట్టోలి గ్రామాలలో వట్టోలి గ్రామ సర్పంచ్ రజితతో కలిసి కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంధత్వరహిత తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని అన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మతిస్థిమితం లేక నీట మునిగి వృద్ధురాలి మృతి

నవతెలంగాణ-కడెం

మతిస్థిమితం లేక వృద్ధురాలు నీట మునిగి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కే.రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్న క్యాంప్ గ్రామానికి చెందిన కాశిపాక మధునవ్వ(65) వృద్ధురాలు గత కొన్ని సంవత్సరాలుగా మతిస్థిమితం సరిగ్గా లేదు. గత నాలుగు రోజుల క్రితం ఇంటి నుండి వెళ్లిపోయి సోమవారం కడెం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో నీటిలో మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఆమ్‌ఆద్మీ పార్టీ కోఆర్డినేటర్‌గా నయీమ్ పాష

నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గ ఆమ్ ఆద్మీ పార్టీ కోఆర్డినేటర్‌గా నయీమ్ పాషాను నియమిస్తున్నట్లు పెద్దపల్లి పార్లమెంటు కన్వీనర్ మాలెం మధు పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ 2018 అసెంబ్లీ నియోజకవర్గ ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి మహమ్మద్ నయీమ్ పాషని మంచిర్యాల జిల్లాలోని, మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గ ఆమ్ ఆద్మీ పార్టీ బాధ్యతలు అప్పగించడం జరిగిందని తెలిపారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు వేళాయే

- రేపటి నుండి పరీక్షలు ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈనెల 15 నుండి మార్చ్ 2వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్ బోర్డ్ అధికారి రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా ఇంటర్ బోర్డ్ కార్యాలయంలో ఆయా ఇంటర్ కళాశాల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించి, పలు సూచనలు తెలియజేశారు. ఈ పరీక్షలు మూడు స్పెల్స్‌లో రెండు సెషన్లలో అంటే ఉదయం 9.00 నుండి మధ్యాహ్నం 12.00 వరకు ఉంటాయని, అలాగే మధ్యాహ్నం 2.00 గంటల నుండి 5.00 గంటల వరకు ఉంటాయని తెలిపారు. అలాగే థియరీ పరీక్షలు మార్చ్ 15 నుండి ఏప్రిల్ 4 వరకు ఉంటాయన్నారు.

ఆఫ్‌లైన్‌లో ప్రాక్టికల్ పరీక్షలు.. పరీక్ష కేంద్రాలు

ఆఫ్‌లైన్‌లో ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఇందుకు 46 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 13, తెలంగాణ సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాలలు 02, తెలంగాణ గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలలు 07, మహాత్మా జ్యోతి పూలే బీసీడబ్ల్యూఆర్ జెసీ 01, మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల 01, మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలు 06, ప్రయివేట్ అన్-ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు 16, ఒకేషనల్ జూనియర్ కళాశాలల సంఖ్య 04, మొత్తం సాధారణ కేంద్రాలు 50 ఉన్నాయని అన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఆరుగురు డిబార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాకతీయ యూనివర్సిటీ పరిధిలో సోమవారం జరిగిన డిగ్రీ పరీక్షల్లో ఆరుగురు కాపీయింగ్‌కి పాల్పడుతూ దొరకగా వారిని డిబార్ చేసినట్లు కేయూ పరీక్షల విభాగం అదనపు అధికారి డా.నరేందర్ పేర్కొన్నారు. ఇందులో ఆదిలాబాద్‌లోని నలంద డిగ్రీ కళాశాలలో ముగ్గురు, ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ఆదిలాబాద్‌లో ఇద్దరు, చెన్నూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక్కరు చొప్పున డిబార్ అయినట్లు తెలిపారు. ఎవరైనా కాపీయింగ్‌కి పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

మౌళిక వసతుల కల్పనకే మన ఊరు మన బడి

నవతెలంగాణ-లోకేశ్వరం

ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకే మన ఊరు మనబడి కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని హద్గాామ్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో మన ఊరు మన బడి కార్యక్రమంలో బాగంగా రూ.61 లక్షలతో నిర్మించే మౌళిక వసతులు కలిగిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.